క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగుల సంఘ సర్కిల్ అధ్యక్షుడిగా సూర్యనారాయణ



మూడు బ్రాంచ్‌ల నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘ (327) పరిధిలోని మూడు బ్రాంచ్‌లకు దాసన్నపేటలోని విద్యుత్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం ఎన్నికలు జరిగాయి. విజయనగరం టౌన్ డివిజన్ యూనిట్, విజయనగరం రూరల్ డివిజన్ యూనిట్, విజయనగరం సర్కిల్‌కు ఎన్నికలు జరగ్గా.. అన్నీ ఏకగ్రీవమయ్యాయి. విద్యుత్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. సాయికృష్ణ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. విజయనగరం టౌన్ అధ్యక్షుడిగా డీవీ చారి, కార్యదర్శిగా టి. అచ్చన్న, రూరల్ డివిజన్ యూనిట్ అధ్యక్షుడిగా కె.కృష్ణారావు, కార్యదర్శిగా ఎంవీవీ సూర్యనారాయణ, సర్కిల్ డివిజన్ అధ్యక్షుడిగా బి. సూర్యనారాయణ, కార్యదర్శిగా బి. రాజేష్ ఎన్నికయ్యారు.

కొనసాగుతున్న తిరుమండల దీక్షలు



కామాక్షి అమ్మవారి సన్నిధిలో హోమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివాలయంలో తిరుమండల దీక్షలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ అర్చకుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో ఆదివారం గణపతి పూజ నిర్వహించిన అనంతరం శివుడికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. కామాక్షి అమ్మవారి సన్నిధిలో షోడశీ కళారాధన, శ్రీ చక్రార్చన పూజలు చేశారు. అలాగే చండీ సప్తశతి పారాయణ, లలిత హోమం, వివిధ పరిహార దేవతల హోమం, నవగ్రహ హోమం, లఘు పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యువతకు సన్మానం



ఉద్యోగం సాధించిన యువకుడిని, తల్లిని సన్మానిస్తున్న పెద్దలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేటలో గురజాడ గ్రామీణ గ్రంథాలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల రాష్ట్ర, కేంద్ర కొలువుల్లో ఉద్యోగాలు సాధించిన యువతీ, యువకులను ఆదివారం ఘనంగా సన్మానించారు. మండల పూర్వపు ఎంఈఓ, హెచ్ఎం అంబల్ల కృష్ణారావు, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, తదితరులు యువతీ, యువకులను సత్కరించారు. ఉద్యోగాలు సాధించిన వారిని ఇతరులు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాంబార్కి రామారావు, బూర్లె సత్యం, సన్యాసిరావు, రమణ, శ్రీరామ్, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



దుర్గాదేవిని దర్శించుకుంటున్న డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురంలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం వెదుళ్లవలస గ్రామంలో 50 మంది విద్యార్థులకు అంబేడ్కర్ కాలనీకి చెందిన దళిత నాయకుడు ఎత్తుల ఈశ్వరరావు నోటు పుస్తకాలు,పెన్నులు,పెన్సిళ్లు,వాలీబాల్‌కిట్ ఆదివారం అందజేశారు. అలాగే గ్రామంలోని చెన్న మల్లికార్జునస్వామి భజన గ్రూపు సభ్యులకు తువ్వాళ్లు అందజేశారు. తన తల్లి వర్ధంతిని పురస్కరించుకుని సేవాకార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. యువకులు అజయ్, గౌరీశంకర్, గణేష్, హర్ష, చంటి పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- ఉత్సాహంగా వాక్ ఫర్ విజయనగరం ర్యాలీ
- మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేసిన యువకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు



వాక్ ఫర్ విజయనగరం ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మనం చేసే రక్తదానం.. ఆపద సమయంలో మరొకరి ప్రాణాలను నిలుపుతుందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆరోగ్యకరమైన వ్యక్తి మూడు, నాలుగు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. అపోహలు వీడి ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. పలు స్వచ్ఛంద సంస్థలు, బ్లడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో.. పైడితల్లి అమ్మవారి పండగ, విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణం నుంచి ఆదివారం నిర్వహించిన వాక్ ఫర్ విజయనగరం ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ రోజున స్వచ్ఛంద సంస్థలు, బ్లడ్‌బ్యాంకుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తాము జీవిస్తున్న ఊరికి ఎంతో కొంత మేలు చేయాలని.. అప్పుడే ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. రక్తదానం చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయేమోనని చాలా మందికి అపోహ ఉందని.. దీనిపై ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వల కొరత ఉంటే తమను సంప్రదించాలని.. వైఎస్సార్‌సీపీ తరఫున శిబిరాలు నిర్వహించి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పద్మనాభం, శాంతికుమారి, ప్రవీణ్‌కుమార్ అంచాలియా, నాగేశ్వరరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధిలో ఏపీ అగ్రగామి



పెదతాడివాడలోని ఏఎస్సార్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పెద తాడివాడ పంచాయతీ ఏఎస్సార్ నగర్, పెదతాడివాడ, ఎస్సీ కాలనీల్లో రూ. 40 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం దంతులూరి కల్యాణ మంటపంలో జరిగిన సభలో ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ, పెదతాడివాడ పంచాయతీలో జరిగిన అభివృద్ధిలో 95 శాతం తన భాగస్వామ్యం ఉందన్నారు. పెదతాడివాడ ఏఎస్సార్ నగర్ పూర్తిస్థాయి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో రెండు బోర్లు కావాలని స్థానికులు కోరగా.. వాటిని కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి పాలన ప్రజల ముంగిటకు తీసుకువచ్చారని.. దీంతో లక్షలాది మందికి ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. విశాఖను పరిపాలనా రాజధానిగా సీఎం ప్రకటించారని, దీంతో వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భోగాపురంలో ఎయిర్‌పోర్టు పనులు అనుకున్న సమయానికి పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల యువజ విభాగం అధ్యక్షుడు కరుమజ్జి త్రినాథరావు, ఎంపీటీసీ సభ్యులు గాదిపల్లి రమేష్, పొంతపల్లి జగన్నాథం, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతపల్లి రామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగత రమణ, చిరంజీవిరాజు, గాదిపల్లి సంతోషి, అధికారులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

సూర్య భగవానుడి సన్నిధిలో కోలగట్ల



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ప్రధానార్చకుడు

విజయనగరం: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం ఉదయం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి విశిష్టతను, ఆలయ చరిత్రను వివరించారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం అధికారులు స్వామివారి ప్రసాదం, చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ.. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ఇవ్వాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు.

బస్ షెల్టర్ ప్రారంభం

జామి: మండలంలోని అలమండ గ్రామంలో ఉప సర్పంచ్ లగుడు దేముడు వ్యాపార పరంగా తన గురువు బండారు కన్నయ్య జ్ఞాపకార్థం రూ.2.50 లక్షలతో నిర్మించిన బస్ షెల్టర్‌ను జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఉపసర్పంచ్‌ను జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం గ్రామంలో ముత్యాలమ్మ తల్లిని దర్శించుకున్నారు.

ప్రణవంలో ఆదిశక్తి...

- ఆధ్యాత్మిక ప్రవచన శిరోమణి సుశీలారాణి



సుశీలారాణిని సత్కరిస్తున్న విజయభావన సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ప్రాణాయామంలో నినదించే ప్రణవంలో ఆదిశక్తి కొలువై ఉంటుందని ఆధ్యాత్మిక ప్రవచన శిరోమణి పి.సుశీలారాణి అన్నారు. విజయ భావన సాహితీమిత్ర సమాఖ్య 526 సభ ఆదివారం స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన ఆమె దేవీవైభవంపై ప్రవచించారు. పైడితల్లి దేవస్థానం పూర్వ ఈఓ భానురాజా సభాధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది కొట్ర కృష్ణమూర్తి హాజరై సుశీలారాణిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.గోపాలరావు, హరిచందన్, భోగరాజు సూర్యలక్ష్మి, ఆదిత్య, జీఎస్.రావు, దామరాజు శంకరం, ఈ.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నెల్లిమర్ల రూరల్: కొత్తపేట ఆలయంలో శాకంబరి అలంకరణలో దుర్గమ్మ



నెల్లిమర్ల రూరల్: బూరాడపేటలో మహిషాసుర మర్దినిగా బాలా త్రిపుర సుందరీదేవి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట శ్రీ రమా సహిత వీర వెంకట సత్యనారాయణస్వామి ఆలయంతో పాటు బూరాడపేట బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజైన ఆదివారం అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

విజయనగరం టౌన్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గమ్మ ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ వేదపండితుడు వెలువలపల్లి నరసింహమూర్తి అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సోమవారం అమ్మవారు మహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.



విజయనగరం టౌన్: దుర్గామాతగా అమ్మవారు

చెడు అలవాట్లకు దూరం..



ర్యాలీలో పాల్గొన్న జరజాపుపేట గ్రామస్తులు

నెల్లిమర్ల: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆకాంక్షిస్తూ జరజాపుపేట పెద్దలు గ్రామంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, యువత మద్యం, జూదం వంటి అలవాట్లకు బానిసలైతే విలువైన జీవితం నాశనమవుతుందన్నారు. చిన్నప్పటి నుంచే ఒక లక్ష్యంతో చదువుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు, మాజీ సైనికులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి బ్యాటరీ ట్రై సైకిల్ అందజేత



పరుశురామ్‌నకు బ్యాటరీ సైకిల్‌ను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: రాజాం నియోజకవర్గం బొద్దాం గ్రామానికి చెందిన వికలాంగుడు రేజేటి పరుశురామ్‌నకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం బ్యాటరీ ట్రై సైకిల్‌ను అందజేశారు. జెడ్పీ చైర్మన్ కార్యాలయం ఆవరణలో లబ్ధిదారుడికి బ్యాటరీ సైకిల్ అందించారు. కార్యక్రమంలో రాజాం వైస్ ఎంపీపీ నక్క వర్షిని, నక్క శ్రీను పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: రాష్ట్రంలో ప్రతీ పేద కుటుంబం ఆర్థికంగా ఎదగాలి, సంతోషంగా ఉండాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమ ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చెప్పారు. ఆదివారం సాయంత్రం పెదఖండేపల్లి గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరిస్తూ...సీఎం జగన్ మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన బ్రోచర్లను అందజేశారు. ప్రజల యోగక్షేమాలు, సమస్యలు తెలుసుకున్నారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం నుంచి జగనన్న అమ్మ ఒడి, చేయూత, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాకానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా, ఆరోగ్యశ్రీ, పెన్షన్‌లు, జగనన్న కాలనీలు, కులవృత్తుల వారికి ఆర్థికసాయం ఇలా అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం సీఎం జగన్ పని చేస్తున్నారని తెలిపారు. దళారీలు లేకుండా, పారదర్శకంగా అర్హులకు పథకాలు అందిస్తున్నామని చెప్పారు. లక్షల కోట్లు ప్రజాధనాన్ని లూటీ చేసిన పెత్తందారులైన ప్రతిపక్ష పార్టీల నాయకులు సిగ్గులేకుండా ఊళ్లలోకి వస్తున్నారన్నారు. వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, జేసీఎస్ ఇన్‌చార్జి వి. సతీష్, కె.వెంకటరావు,రంధి అనంత్,కె.అప్పయ్య, పెదఖండేపల్లి గ్రామనాయకులు రంభ వెంకటరమణ, మేరపురెడ్డి చిన్న, సతీష్, వై.గణేష్, ఎం.రఘు, నేతేటి శివ, కె.జయశంకర్ మోపాడ కోటి, సీహెచ్. వెంకటరావు, అప్పలసత్యం, ఎం.బుజ్జి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్నదానం



గొట్లాంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

బొండపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గొట్లాం గ్రామంలోని బంగారమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 5 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు వాడపల్లి కొండబాబు, వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, నాయకులు గ్రామ పెద్దలు మీసాల తుల సీరాం పాల్గొన్నారు. అలాగే అంబటివలసలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.